క్లుప్తంగా

నేరేడుచర్ల మున్సిపల్ కమిషనర్‌గా శ్రీనివాస్‌రెడ్డి

నేరేడుచర్ల : నేరేడుచర్ల నూతన మున్సిపల్ కమిషనర్‌గా హుజూర్‌నగర్ మున్సిపాలిటీ నుంచి బదిలీపై వచ్చిన కె. శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. నేరేడుచర్ల మున్సిపల్ కమిషనర్‌గా పని చేసిన ఎస్. వెంకటేశ్వర్లు హుజూర్‌నగర్ మున్సిపాలిటీకి బదిలీ కాగా ఆయన స్థానంలో శ్రీనివాస్‌రెడ్డి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

మల్టీపర్పస్ సిబ్బందికి సన్మానం



సిబ్బందిని సన్మానిస్తున్న సర్పంచ్ సీతారాంరెడ్డి

గరిడేపల్లి : గరిడేపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో పారిశుద్ధ్య వార్షికోత్సవాల సందర్భంగా మల్టీపర్పస్ సిబ్బందిని ఆగ్రామ సర్పంచ్ సీతారాంరెడ్డి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వనజ, ఎంపీఓ మౌలానా, ఉపసర్పంచ్ సైదాబీ, కార్యదర్శి రేణుక, వార్డు సభ్యులు నారాయణ, రాంరెడ్డి, కోఆప్షన్ బొంత వెంకట్‌రెడ్డి, రాజ్ మహ్మద్, నరసయ్య పాల్గొన్నారు.

నేత్రదానం



సంతాపం తెలుపుతున్న వాసవీ క్లబ్ సభ్యులు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌కుచెందిన వ్యాపారి చెన్నూరు కృష్ణమూర్తి (78) మంగళవారం మృతిచెందాడు. ఆయన కుటుంబ సభ్యుల అభ్యర్థన మేరకు ఖమ్మం నేత్రనిధి వారు వచ్చి నేత్రాలను సేకరించారు. కాగా కృష్ణమూర్తి మృతదేహంపై వాసవీ క్లబ్ సభ్యులు పూలమాల వేసి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇమ్మడిశెట్టి కనకసేనారావు, వాసవి క్లబ్ సభ్యులు ఊరే వెంకయ్య, ఎ రవి కుమార్, స్వామి, గోపి, బి శ్రీనివాస్, ఎం చిరంజీవి, వి రామ్‌నరేష్, సతీష్ పాల్గొన్నారు.

మహిళకు రక్తదానం

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళకు ఓ పాజిటివ్ రక్తం అవసరం కావడంతో వారు జన చైతన్య ట్రస్ట్ సభ్యులను సంప్రదించారు. మంగళవారం వారు రక్తదాత పొలగాని సాయితో మాట్లాడి రక్తదానం చేయించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పి వంశీ,పి సాయి, పి శివశంకర్ పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం

నడిగూడెం : మండల పరిధిలోని బృందావనపురం గ్రామానికి చెందిన బొడ్డు ఆదిలక్ష్మికి చెందిన గుడిసె మంగళవారం విద్యుదాఘాతానికి గురవ్వడంతో పూర్తిగా దగ్ధమైంది. ప్రమాద సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కట్టుకున్న దుస్తులు తప్ప ఇంట్లో ఉన్న వస్తువులన్ని దగ్దమయ్యాయి. బాధితురాలికి కోదాడకు చెందిన అంజి యాదవ్ రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. బాధితురాలికి డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు చేసి, ఆదుకోవాలని కోరారు.

మహాసభ కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

భానుపురి (సూర్యాపేట) : హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈనెల 28న నిర్వహించనున్న చాకలి ఎస్సీ సాధన సమితి ఆరోవార్షికోత్సవ మహాసభ కరపత్రాలను ఆ సంఘం నాయకులు మంగళవారం సూర్యాపేట పట్టణంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సట్టు నాగయ్య మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఉపేందర్, ఎక్కినపల్లి శ్రీను, లింగయ్య, శైలజ, పద్మ, నీలిమ, సైదమ్మ, సంధ్య, అఖిల పాల్గొన్నారు.

నేడు అఖిలపక్షం ఆధ్వర్యంలో ధర్నా

తిరుమలగిరి (తుంగతుర్తి) : పట్టణంలో నేడు (బుధవారం) అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ కందుకూరి సోమయ్య తెలిపారు. మంగళవారం మున్సిపాలిటీ కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ మహాధర్నాకు కాంగ్రెస్, బీజేపీ, వైఎస్ఆర్ తెలంగాణ, సీపీఎం, ఇతర ప్రజాపక్షం నేతలు హాజరు కానున్నారని తెలిపారు. ఈ మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఆయన వెంట సీపీఎం నాయకులు కడెం లింగయ్య ఉన్నారు.

పెచ్చులూడుతున్న ఇళ్లు





పెచ్చులూడి శిథిలావస్థకు చేరిన ఇళ్ల సీలింగ్

- భయాందోళనలో మాధవగూడెం కాలనీవాసులు
- ఎస్సీలకు 35ఏళ్ల కిందట పంపిణీ చేసిన ప్రభుత్వం
- వర్షం వస్తే ఇంట్లో ఉండలేని పరిస్థితి
- నూతన ఇళ్లు మంజూరు చేయాలని వేడుకోలు

చిలుకూరు : మండల పరిధిలోని నూతనంగా ఏర్పడిన మాధవగూడెంకు చెందిన 25మంది ఎస్సీలకు 35 ఏళ్ల కిందట ప్రభుత్వం ఇళ్లు పంపిణీ చేసింది. ప్రస్తుతం ఆ ఇళ్లు పెచ్చులూడి శిథిలావస్థకు చేరుకున్నాయి. ఏమాత్రం కొద్దిపాటి వర్షం వచ్చినా ఇంట్లో ఎవరూ ఉండలేని పరిస్థితి. వానొస్తే అందరూ ఇంట్లోకి పోతారు కానీ, ఆ కాలనీ వాసులు వానొస్తే భయటకు వస్తారు. ఇది ఆ కాలనీ వాసుల దుస్థితి.

శిథిలావస్థకు చేరిన ఇళ్లు

మాధవగూడెం ఎస్సీ కాలనీలో 25 ఇళ్లు ఉన్నాయి. ఈ ఇళ్లు మొత్తం పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. ఆ ఇళ్లలో తండ్రి, తల్లి వారి కుమారులు, మనవళ్లు, మనవరాళ్లు ఉంటున్నారు. ఆనాడు పంపిణీ చేసిన ఇళ్లలో రెండు గదులు ఉన్నాయి. అ రెండు గదుల్లోనే సుమారుగా ఒక్కో ఇంట్లో సుమారుగా చిన్న పిల్లలతో కలుపుకొని ఐదుగురి నుంచి ఆరుగురు ఉన్నారు. అయితే ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన బిక్కు బిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. ఇక వర్షం కురిస్తే వాళ్ల పరిస్థితి దారుణంగా ఉంటుంది. ఇంట్లో ఉండలేక. భయట నిలవడ లేక తీవ్ర ఇబ్బందులుకు గురవుతున్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి నూతన ఇళ్లు అయినా కట్టించాలి లేదా ఇంటికీ రూ.5లక్షల చొప్పున డబ్బుల మంజూరు చేస్తే ఇళ్లు నిర్మించుకుంటామని కాలనీవాస్లు పేర్కొంటున్నారు.

వర్షం వస్తే ఇంట్ల ఉండలేం



ఎప్పుడో ప్రభుత్వం మంజురు చేసిన ఇళ్లు పూర్తిగా శిథిలాస్థకు చేరుకున్నాయి. భవనం పైనుంచి పెచ్చులూడి పడుతున్నాయి. రాత్రి సమయంలో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉంది. భవనం కూడా కూలేందుగా సిద్ధంగా ఉంది. ప్రభుత్వం స్పందించి ఇళ్లు నూతనంగా నిర్మించి ఇవ్వాలి.

– మాదాసు గురవయ్య, మాధవగూడెం

ఆరు బయటే నిద్రపోతున్నా



నాకు ఇంటి స్థలం ఉంది. ఇళ్లు లేదు. గత్యంతరం లేక కిరాయికి కాలనీలో ఒక ఇంట్లో ఉంటున్నాను. అ ఇళ్లు కూడ పెచ్చులూడి శిథిలావస్థకు చేరుకుంది. ఆరు బయటే నిద్రపోవాల్సి వస్తుంది. ఇళ్లు లేక నానా ఇబ్బందులు పడుతున్నా. వర్షం వస్తే ఇబ్బందులు చెప్పాల్సిన అవసరం లేదు. ఇంటి నిర్మాణానికి నిధులు మంజూరు స్తే ఇళ్లు నిర్మించుకుంటాం.

– రాంపంగు సుజాత, మాధవగూడెం, చిలుకూరు మండలం

హరితహారం చెట్ల నరికివేతపై విచారణ



విచారణ చేస్తున్న ఎంపీడీఓ, ఏఈ, అధికారులు

చిలుకూరు : మండల పరిధిలోని పోలేనిగూడెం రోడ్డులో హరితహారం చెట్లు నరికివేస్తున్నారని సాక్షిలో మంగళవారం ‘హరితహారం చెట్ల నరికివేత’ అనే శీర్షికతో వచ్చిన కథనానికి కలెక్టర్ స్పందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పోలేనిగూడెం రోడ్డులో నరికివేసిన చెట్లను ఎంపీడీఓ ఈదయ్య, ఎంపీఓ పాండు యాదవ్, ట్రాన్స్‌కో ఏఈ సైదులు, ఆర్‌ఐ మంత్రిప్రగడ సీతయ్యలు విచారణ చేశారు. ట్రాన్స్‌కో లైన్‌మెన్ రామానాథం ఆదేశాల మేరకు విద్యుత్ సిబ్బంది నాగరాజు విద్యుత్‌వైర్లకు అడ్డుగా ఉన్నాయని చెట్టు కొమ్మలు తొలగించాల్సింది ఉండగా ఏకంగా 15 చెట్లు నరికివేశారని, అలాగే పొలానికి నీడ వస్తుందని రైతు బిట్టు రామారావు ఒక చెట్టు నరికివేసినట్లు గా గుర్తించారు. నాలుగేళ్ల కిందట హరితహారంలో నాటిన 16చెట్లను నరికివేసినందుకు గాను కలెక్టర్ ఆదేశాల మేరకు ముగ్గురిపై పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశారని తెలిపారు. హరితహారం నాటిన చెట్లును నరికివేయకూడదని, గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా చెట్లను నరికివేస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ ఈదయ్య హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తిరుగుమళ్ల వెంకటమ్మ, టీఏ గిరి , కార్యదర్శి అంజయ్య పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని వేపలసింగారంలో ఈనెల 24న నిర్వహించనున్న ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ అన్నెం శిరీషాకొండారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్యశిబిరంలో రక్తపరీక్షలు, జ్వరం, కాళ్లు, కీళ్లనొప్పులు, తదితర సమస్యలు ఉన్నవారు సద్వినియోగంచేసుకోవాలని పేర్కొన్నారు.

హెడ్‌కానిస్టేబుల్‌కు నివాళి

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌కు చెందిన తుమ్మకొమ్మ భాస్కర్ భువనగిరిలో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతిచెందాడు. ఆయన మృతదేహనికి తిలక్‌నగర్ అంబేడ్కర్ అసోసియేషన్, పులువురు కళాకారులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

కూలీలకు బిల్లులు చెల్లించాలి

మునగాల : ఉపాధి కూలీలకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ముల్కలపల్లి రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని జగన్నాథపురంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఉపాధి హామీ చట్టం ప్రకారం పనులు జరిగే చోట కూలీలకు అవసరమైన సదుపాయాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వసతులు లేకపోవడంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సోంపంగు జానయ్య, జిల్లా కమిటీ సభ్యుడు ఆరె రామకృష్ణారెడ్డి, నాయకులు వెంపటి పరుశ రాములు, నల్లమాద కృష్ణయ్య, బొల్లం బిక్షం, పాల్గొన్నారు.

మంత్రి పర్యటనను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న క్లస్టర్ ఇన్‌చార్జ్, సర్పంచ్ మన్నెం శ్రీనివాసరెడ్డి

మఠంపల్లి : ఈనెల 26నఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి ఆధ్వర్యంలో మఠంపల్లి మండల కేంద్రంలో నిర్వహించే బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరవుతున్న రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పర్యటనను జయప్రదం చేయాలని క్లస్టర్ ఇన్‌చార్జ్ మఠంపల్లి సర్పంచ్ మన్నెం శ్రీనివాసరెడ్డి కోరారు. మంగళవారం మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఇరుగు పిచ్చయ్య అధ్యక్షతన నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని 33గ్రామపంచాయతీల పరిధిలో 42 ఆవాసగ్రామాల నుంచి వేలాదిమందిని తరలించేందుకు పార్టీ ప్రజాప్రతినిదులు, నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో మఠంపల్లి గ్రామశాఖ అధ్యక్షుడు రామచంద్రయ్య, జెడ్పీటీసీ జగన్, సర్పంచ్‌లు లక్ష్మీనరసింహరాజు, కృష్ణవేణినరేష్ అనితాశ్రీను నాయక్, ఎంపీటీసీలు సైదమ్మ, నాగిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు సుధాకర్‌రెడ్డి, భవానివెంకటరెడ్డి, కంటులక్ష్మయ్య, బీవీరామారావు ,లక్ష్మీనరసింహారెడ్డి, నవీన్‌నాయక్, సురేష్‌గౌడ్, బాలకృష్ణగౌడ్, రవీందర్‌నాయక్ ఉన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలపై నేటి యువత ఉద్యమించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మంగళవారం సూర్యాపేట పట్టణంలో ధర్మభిక్షం భవనంలో బూర సైదులు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆయన విచ్చేసి మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను పూర్తిస్థాయిలో భర్తీ చేస్తామని, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తామని, ఉపాధి అవకాశాలు సృష్టిస్తామని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన అనంతరం వాటిని తుంగలో తొక్కారని విమర్శించారు. ఉద్యోగాలు లేక యువత వ్యసనాలకు బానిసలవుతూ డ్రగ్స్, గంజాయికి అలవాటు పడి వారి జీవితాలు నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. నిరుద్యోగ భృతి కింద ప్రతి నిరుద్యోగికి రూ.5వేలు ఇవ్వాలన్నారు. సమావేశంలో అఖిల భారత యువజన సమైఖ్య పట్టణ కార్యదర్శి బీపీ నరేష్‌రెడ్డి, మైనార్టీ నాయకులు పాషా, పెండ్ర కృష్ణ, పట్టణ సహాయ కార్యదర్శి అయితగాని కామేష్, కోశాధికారి ఏడెల్లి శ్రీకాంత్, వాడపల్లి గోపి తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షుడికి సన్మానం

నాగారం : సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా రెండో సారి నియమితులైన చెవిటి వెంకన్న యాదవ్‌ను మంగళవారం మండల కాంగ్రెస్ నాయకులు సూర్యాపేటలో ఆయనను కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్య యాదవ్, నాయకులు పాల్గొన్నారు.



వెంకన్నను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎమ్మెల్యేకు భవిష్యత్‌లో పుట్టగతులు ఉండవు

భానుపురి (సూర్యాపేట) : మాదిగలను విస్మరించిన ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కు తుంగతుర్తి నియోజకవర్గంలో భవిష్యత్‌లో పుట్టగతులు ఉండవని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ యాతాకుల రాజన్న అన్నారు. మంగళవారం పట్టణంలోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద మహాజన సోషలిస్టు పార్టీ, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గాదరి కిశోర్ వ్యాఖ్యలను ఖండిస్తూ నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడారు. నియోజకవర్గంలో అక్రమ దందాలతో ప్రజాధనాన్ని దోపిడీ చేస్తున్న ఎమ్మెల్యే కిశోర్ అధికార దాహంతో ప్రశ్నించిన వారిపై దాడులు చేస్తున్నాడని ఆరోపించారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని, దళితులను కించపరిచేలా చేసిన వ్యాఖ్యలపై వెంటనే క్షమాపణ చెప్పాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎర్ర వీరస్వామి, బొజ్జ సైదులు, కనుకుంట్ల వెంకన్న, ములకలపల్లి రవి, దాసరి వెంకన్న, మల్లేష్, వెంకన్న, దైదను, వెంకన్న, అర్జున్, సుమన్ పాల్గొన్నారు.

క్రీడల అభివృద్ధికి దాతలు సహకరించాలి

అర్వపల్లి : గ్రామీణ క్రీడల అభివృద్ధికి దాతలు సహకరించాలని జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్ కోరారు. సీఎం కప్ క్రీడోత్సవాల్లో భాగంగా జాజిరెడ్డిగూడెం మండలం నుంచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు మంగళవారం మండల కేంద్రంలో తన సొంత ఖర్చులతో క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. క్రీడలు, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తన శక్తి మేర సాయం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీడీ సోమయ్య, పీఈటీలు లింగాల రవి, సైదులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రపంచ మేధావి బీఆర్ అంబేడ్కర్



తుంగతుర్తి : బండరామారంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కిశోర్‌కుమార్

తుంగతుర్తి : ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బండరామారం గ్రామంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని జెడ్పీచైర్‌పర్సన్ గుజ్జ దీపిక యుగేందర్‌రావులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంలోని ఆర్టికల్ –3 ద్వారానే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గుండగాని కవితరాములుగౌడ్, డీసీసీబీ డైరెక్టర్ సైదులు, వైస్ఎంపీపీ మట్టపల్లి శ్రీశైలం, సర్పంచ్ ఉప్పునూతల ప్రణీత జయచందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, సైదులు, ముత్తిలింగం, ఉప్పలయ్య, పాల్గొన్నారు.

దళితులను దూషించలేదు..

తిరుమలగిరి మండల కేంద్రంలో ఇటీవల జరిగిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో తాను దళితులను దూషించినట్లు ప్రతిపక్ష పార్టీలు అసత్య ఆరోపణలు చేస్తున్నాయని ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ తెలిపారు. బండరామారంలో అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ అనంతరం ఆయన మాట్లాడారు. ఆత్మీయ సమ్మేళనంలో ఏ ఒక్కరిని కూడా తాను వ్యక్తిగతంగా దూషించలేదన్నారు. తిరుమలగిరి మండలాన్ని దళితబంధు పైలెట్ ప్రాజెక్టుగా తానే సీఎం కేసీఆర్ దగ్గర కొట్లాడి తీసుకొచ్చానని అన్నారు. దళితులకు ఏచిన్న సమస్య వచ్చినా తానే ముందుండి పోరాడే వ్యక్తినని అన్నారు.

అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్లు

నూతనకల్ : రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్లలాంటివని ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్ అన్నారు. మండలంలో 23మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణ లక్ష్మి చెక్కులను మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు దేశంలో ఆదర్శంగా నిలిచి ఆడపిల్ల తల్లిదండ్రులకు భరోసా కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం మండల కేంద్రం నుంచి వెంకెపల్లి గ్రామానికి ఎంఆర్ఆర్ నిధుల ద్వారా రూ.3కోట్ల 48లక్షలు, మండల కేంద్రం నుంచి లింగంపల్లి క్రాస్ రోడ్డు వరకు సీఆర్ఆర్ నిధులు ద్వారా రూ.3కోట్లతో నిర్మించే బీటీ రోడ్డు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాలకు రవాణా సౌకర్యం పూర్తిస్థాయిలో ఉన్నప్పుడే ఆ గ్రామాలు అభివృద్ధి సాధిస్తాయన్నారు. ప్రతి గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణంతో పాటు గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ భూరెడ్డి కళావతిసంజీవరెడ్డి, జెడ్పీటీసీ కందాల దామోదర్‌రెడ్డి, ఎంపీటీసీ పన్నాల రమామల్లారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మున్నా మల్లయ్య యాదవ్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు చూడి లింగారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కనకటి వెంకన్న, సర్పంచ్ కొంపెల్లి రాంరెడ్డి, పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి



ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజలు

హుజూర్‌నగర్‌రూరల్ : క్షేత్రస్థాయిలో తాగునీటి సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి పోషనబోయిన హుస్సేన్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గోపాలపురంలో 9, 10 వార్డులలో తాగునీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని స్థానిక మహిళలతో కలిసి నిరసన వ్యక్తం చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. గత నెల రోజులగా మండల వ్యాప్తంగా తాగునీటి సమస్యలతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. పలుమార్లు స్థానిక సర్పంచ్ శాసనాల నాగసైదయ్య, కార్యదర్శి ఇందిరకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని, తాగునీటికి, నిత్యావసరాల కోసం వ్యవసాయ బావుల మీద, ఇతర ప్రాంతలపై ఆధారపడాల్సి వస్తుందన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి గ్రామంలో తాగునీటి సమస్యలను పరిష్కరించాలని అయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు సిదెద్ల వెంకటి, కాలువ శ్రీనివాస్, కాలనీ వాసులు నాగమణి, మరియమ్మ, వరమ్మ, సైదమ్మ, పాపమ్మ, అంజమ్మ, సరిత, పుల్లమ్మ, రేణుక, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు ట్రైసైకిళ్లు అందజేత



ట్రైసైకిళ్లు అందజేస్తున్న సాగర్ సిమెంట్ పరిశ్రమ అధికారులు

మఠంపల్లి : మండల కేంద్రానికి చెందిన ఆరుగురు వికలాంగులకు మంగళవారం స్థానిక సాగర్‌సిమెంట్స్ యాజమాన్యం ట్రైసైకిళ్లను అందజేసింది. ఈ సందర్భంగా స్థానికులు తిరుపతయ్య, వెంకటేశ్వర్లు, ఉపేందర్, కనకయ్య, తదితరులను గుర్తించి పరిశ్రమకు ఆహ్వానించి హెచ్ఆర్ డీజీఎం హరిదాస్, పర్సనల్ మేనేజర్ తూడి వెంకటరెడ్డిలు ఆ ట్రైసైకిళ్లను అందజేసి మాట్లాడారు. సామాజిక కార్యక్రమాలను ఎప్పుడూ కొనసాగిస్తామన్నారు. వికలాంగులకు సాయం చేయడంపై సమాచార హక్కు సాధన సమితి మీసాల మధుబాబు, వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఏసుమళ్ల రాములు పరిశ్రమ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ అధికారులు సుబ్రహ్మణ్యం, వి.వెంకటరెడ్డి, కొండలు తదితరులున్నారు.

మెటల్‌రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ అంజిరెడ్డి

పాలకవీడు : మండలంలోని పాలకవీడు గ్రామం నుండి నుంచి యల్లాపురం వరకు గల లింక్‌రోడ్డు, గుండెబోయినగూడెం గ్రామంలో మెటల్‌రోడ్డు నిర్మాణ పనులను మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కిష్టిపాటి అంజిరెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి చొరవతో పాలకవీడు నుండి యల్లాపురం వరకు మెటల్‌రోడ్డు నిర్మాణానికి స్పెషల్ డెవలప్‌మెంట్ నిధులు రూ.10 లక్షలు, గుండెబోయినగూడెం గ్రామంలో మెటల్‌రోడ్డు నిర్మాణానికి జిల్లా మినరల్ ఫండ్ నుండి రూ.3.50 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరుపై ఆయా గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు పీఏసీఎస్ చైర్మన్ యరడ్ల సత్యనారాయణరెడ్డి, గుండెబోయినగూడెం సర్పంచ్ నేరేడు సైదులు, సర్పంచ్ తాటికొండ వెంకట్‌రెడ్డి, యలంచెరువు జాన్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, అచ్చయ్య, మహేందర్‌రెడ్డి, కవిత, శోభన్‌బాబు, వెంకట్‌నాయుడు, పుష్ప గ్రామస్తులు పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి చేయూత



కొండల్‌రావు కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న మిత్రులు

మోతె : మండల కేంద్రానికి చెందిన గుంటగాని కొండల్ రావు ఇటీవల హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా, అతడి కుటుంబానికి 1999–2000 పదో తరగతికి చెందిన తోటి స్నేహితులు అండగా నిలిచారు. మంగళవారం ఆ కుటుంబ సభ్యులకు రూ.1,81,500లను ఆర్థిక సాయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో గురిజాల రమేష్, సురకంటి రామకిశోర్‌రెడ్డి, లచ్చుమళ్ల సతీస్, ముద్దం కిరణ్‌రెడ్డి, మామిడి నాగయ్య, ఎల్మకొండ సతీస్‌రెడ్డి, బొడ్డు నర్సింహ, కొడిదల విద్యాసార్, బొక్క జాన్ రెడ్డి, నిమ్మల బుచ్చిలింగయ్య, బత్తుల సత్యనారాయణరెడ్డి, గురిజాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎస్సీ కమ్యూనిటీ హాల్‌కు ప్రహరీ నిర్మించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దళిత సంఘాల నాయకులు

నేరేడుచర్ల : నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నెంబరు 243, 244లో ఎస్సీ కమ్యూనిటీహాల్ కోసం కేటాయించిన భూమికి ప్రహరీ నిర్మించాలని కోరుతూ మంగళవారం దళిత సంఘాల ఆధ్వర్యంలో మండల తహసీల్దార్ సరితకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2003లో అప్పటి జిల్లా కలెక్టర్ సిసోడియ డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ ఆడిటోరియం నిర్మాణం కోసం 243, 244 సర్వే నంబరులో 21 కుంటల భూమిని కేటాయించినట్లు తెలిపారు. ఆ భూముల్లో కొంత ఆక్రమణకు పాల్పడుతున్నారని ఆ పత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో దళిత సంఘాల నాయకులు ఇంజమూరి వెంకటయ్య, చంద్రయ్య, సైదులు, జానయ్య, వెంకటేశ్వర్లు, పున్నయ్య పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

సూర్యాపేట రూరల్ : పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని జెడ్పీటీసీ జీడి భిక్షం అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కాసరబాద గ్రామంలో పారిశుద్ధ్య వారోత్సవాల్లో భాగంగా డ్రెయినేజీల్లో పూడిక తీయడంతో పాటు రోడ్లను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొల్లు రేణుక, ఎంపీటీసీ బంటు నాగమ్మ, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సంకరమద్ది రమణారెడ్డి, రమేష్, పంచాయతీ కార్యదర్శి సలీం తదితరులు పాల్గొన్నారు.



కాసరబాదలో డ్రెయినేజీని శుభ్రం చేస్తున్న జెడ్పీటీసీ భిక్షం

ఉపాధి పనులు కల్పించాలి



రఘునాథపాలెంలో ఉపాధిపనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ, ఎంపీఓలు

మఠంపల్లి : మండలంలోని అన్నిగ్రామాల్లో ఉపాధిహామీ జాబు కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలని ఎంపీడీఓ మామిడి జానకి రాములు అన్నారు. మంగళవారం మినీ పల్లె ప్రగతి పనులు ముగింపురోజున ఎంపీఓ ఆంజనేయులుతో కలిసి మండలంలోని రఘునాథపాలెం, మఠంపల్లి, గుండ్లపల్లి, వెంకటాయపాలెం తదితర గ్రామాల్లో ఉపాధి పనులు, పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలు, మంచినీటి సరఫరా ,తదితర అభివృద్ధి నులను పరిశీలించి మాట్లాడారు. కాగా మినీ పల్లె ప్రగతి స్పెషల్ డ్రైవ్ పూర్తయినప్పటికీ ప్రతినిత్యం గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు సర్పంచ్‌లు, కార్యదర్శులు కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పఠాన్‌జానిబీ,ఉపసర్పంచ్ శ్రీనివాసరెడ్డి, జేపీ మట్టయ్య, ఎఫ్ఏ భిక్షం, రహీమ్ తదితరులున్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ భిక్షం

పెన్‌పహాడ్ : గ్రామాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని ఎంపీపీ నెమ్మాది భిక్షం వైద్య సిబ్బందికి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన జనారోగ్య సమితి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో స్వచ్ఛత, పరిశుభ్రత, జీవనశైలి, వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజల ఆరోగ్య సమస్యలు తెలుసుకొని తగిన పరిష్కారాలు చేయాలని వైద్యసిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శేషగిరిరావు, ఎంపీటీసీ జానకమ్మ, జూలకంటి వెంకట్‌రెడ్డి, బైరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వైద్యాధికారి స్రవంతి, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.